కథ

# పవిత్ర అత్యాచారం

**— రాప్తో శివశంకర్.**

తన మీద యేదో వికృతమైన రోమాలతో నిండిన సరీసృపం పాకుతున్నట్లె వులిక్కిపడి లేచింది సరిత. అది తన భర్త చెయ్యి. జీవితాంతం భరించక తప్పని హింస. ఛీ కొట్టే అర్హత కూడా కోల్పోయింది. ఆమె అతని భార్య

సరిత ఒక ప్రభుత్వ ఉద్యోగ ఇంటర్వ్యూలో సెలెక్ట్ కాకపోవడంతో అనరాని మాటలన్నాడు."బుర్రలేనిదానివి. పోస్టు గ్రాడ్యుయేషన్ చదివేం లాభం? ఎవరైనా అడిగితే టెన్త్ తప్పానని చెప్పుకో. వెధవ మొహం."

తన చదువు యీ తిట్లనే మిగిల్చింది. ఎప్పుడూ అధికార స్వరం, దబాయింపు, తనకన్నీ తెలుసుని, గొప్పవాడినని అహం. ఏముంది గొప్ప? కుల బలం, డబ్బూ తప్ప. ఆ రోజుల్లో తన కులం అధికారంలో వుండటం వల్లే కదా అతడికి అంత మంచి ఉద్యోగం వచ్చింది!.

తన భర్త సాంబశివరావుకి తగినంత ఆస్తి వుంది. దానికితోడు వడ్డీ వ్యాపారం కూడా చేస్తాడు. మొన్న వొక పేదరైతుని చూస్తుంటే తనకి కూడా కన్నీళ్లు తిరిగాయి.

"నా పెళ్లాం మంచమెక్కింది. సావు బతుకుల్లో కొట్టుకుంటోంది. వోపిక పట్టండి. కూసింత గంజి తాగితే మీ అప్పు బేగిరం తీర్చేస్తా."

సాంబశివరావు ఖస్సుమన్నాడు.

"మీ ఆవిడ ఛస్తేనేం, వుంటేనేం! డబ్బు కక్కు. అది చస్తే అప్పు తీర్చవా?"

జర జరా చెయ్యి ఛాతీ మీదికి... విసిరికొట్టబోయింది. ఏయ్ లం... అని దగ్గరికి లాక్కున్నాడు.

పత్తి రైతులు అప్పు తీర్చలేక పురుగుల మందుతాగి చచ్చిపోతున్నారు. అప్పు తీర్చకుండా చచ్చాడు...యెవడు తీరుస్తాడు. నా నెత్తి మీద చెంగేసిపోయాడు" అని విసుక్కుంటాడు.

యింత అడ్డగోలుగా డబ్బు వెనకేస్తున్నా లక్షల కట్నం వెంట తెచ్చినా పెళ్ళానికి వుద్యోగం రాకపోతే రోజు గడవనట్లు తిట్టిపోస్తాడు. ఆడదానికి చదువూ, జ్ఞానమూ మళ్ళీ అవమానాల కోసమేనా? అవి బంధనమేనా?

యిటీవల తనెందుకింతలా ఆలోచిస్తోంది? "నీకసలు బుర్రుందా?" అని మాటి మాటికీ తిడ్తాడు. తలని అనుమానంగా తడుముకొంది. దీనవసరం ఎప్పుడైనా వచ్చిందా!

శరీరాన్ని చీల్చనీ... ఇంకా హింసించనీ... తన తండ్రి పెద్దకులపు మోతుబరి. బాగా చదివించి గంగిరెద్దులా సింగారించి పశువుని తోలినట్లు వీడి దగ్గరికి తోలేశాడు.

అయినా ఎందుకిలా ఆలోచిస్తోంది?

డబ్బూ, ఆస్తి వున్న మొగుడు. ఏం మిస్సయింది?

అసలు మిస్ అవడమంటే యేంటి? అతనితో ఎప్పుడూ మనస్ఫూర్తిగా సుఖపడలేదా!

నగలూ నట్రా, చీరలూ ఈ సింగారింపులన్నీ సరే...తన వెందుకిలా చిన్న చూపు చూస్తాడు? ఎందుకిలా అడవి జంతువులా గర్జిస్తుంటాడు.

ఆధిక్యతని నిలుపుకోవడంలో ఆనందం జుర్రుకుంటాడు. ఏ విషయం తనతో సంప్రదించడు

అసలు అతనికేం కావాలి? డబ్బు యావ. ఔను యావ. అది తప్ప వాడికేం వుంది. అందుకే ఆ మాల అమ్మాయిని కడుపు చేసి...

హంతకుడు రక్తమంటిన చేతుల్తో తన శరీరాన్ని తడుముతున్నాడు. రేప్.

* * * *

ఫ్యాక్షనిస్టుల గ్రామం వంటి యోని



వర్శిటీ. రెండు అగ్రకులాల మధ్య ఎప్పుడూ కొట్లాటలు. మధ్యలో నలిగి పోయే దళితులు.

అక్కడ పి.జి. వెలగబెడ్తున్నాడు సాంబశివరావు. అతడొక స్టూడెంట్ యూనియన్ లీడర్. నిజానికి ఆ యూనియన్ అతని కుల సంఘం.

అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అతని కులం అధికారంలోని వచ్చింది. ప్రత్యర్థి కులానికి చెందిన వైస్ ఛాన్సలర్‌ని మార్చాలని గలభా మొదలైంది. దానికి నాయకుడు సాంబశివరావు. యూనివర్శిటీ ఆడిటోరియంలో కొత్తగా అధికారంలోని వచ్చిన రాజకీయ నాయకులకి సన్మానం, వారి రెచ్చగొట్టే ప్రసంగాలు. "వైస్ ఛాన్సలర్ ముకుంద రెడ్డిని పిచ్చికుక్కని తరిమికొట్టినట్లు తరిమి కొట్టాలి. వాడు తన వాళ్ళని వుద్యోగాల్లో, పదవుల్లో నింపేశాడు. కుల పిచ్చి, పక్షపాతం"

తరువాత సాంబశివరావు నాయకత్వంలో వైస్ ఛాన్సలర్ కులానికి చెందిన ప్రొఫెసర్లు, లెక్చరర్లపై దాడులు మెదలయ్యాయి.డిపార్ట్‌మెంటు బిల్డింగుల్లోంచి కొడ్తూ, చొక్కాలు చింపుతూ, తిడ్తూ ఈడ్చుకొచ్చారు. ప్రిన్సిపాల్‌ని కూడా బయిటికిలాగి చితగ్గొట్టారు.

యింత జరుగుతున్నా సకాలంలో ఒక్క పోలీసూ క్యాంపస్ వైపు కన్నెత్తి చూడలేదు.

సాంబశివరావు తన గుంపుతో కలిసి ఎకనామిక్స్ డిపార్టమెంట్ హెడ్ శివ ప్రసాద్‌ని తన కులం వాడనే మినహాయింపు లేకుండా కొడ్తూ బట్టలు చింపుతూ బైటికి ఈడ్చుకొచ్చాడు.

"ఏరా! మన ఎమ్మెల్యే కూతురికే ఆప్‌సెంట్ వేసి, స్కాలర్ షిప్ ఆపు చేస్తావా! నీకెంత పొగర్రా. మనోడివని విడిచి పెడ్తే ఎన్నిసార్లు వార్నింగిచ్చినా నీకు లెక్క లేదురా...

"ఎవరేం చేసినా నేను రూలు ప్రకారం పోతాను. అసలు డిపార్ట్‌మెంట్ మొహం చూడకుండా తిరిగే ఆ అమ్మాయికి ఎందుకు హాజరు వెయ్యాలి? ఎందుకు స్కాలర్ షిప్ నిలిపివేయ కూడదు? " అన్నాడు ప్రొఫెసర్ శివ ప్రసాద్.

కుల పిచ్చిలేని ఆ ప్రొఫెసర్ని చితకబాదారు. "నీతులు చెప్తున్నాడురా వా... అంటూ కింద పడేసి కొట్టాడు సాంబశివరావు.

అంతా సద్దమణిగాక క్యాంపస్‌ని చుట్టుముట్టారు పోలీసులు.

రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంలో చాలా వుత్సాహంగా పాల్గొన్నాడు సాంబశివరావు. కింది కులాల వారిని తిట్టి కొట్టి తన ప్రతిభని కూడా నిరూపించుకున్నాడు.

ఒకసారి సాంబశివరావుకి వాచీ కన పడలేదు. స్వీపర్ని గదిలో బంధించి కరెంటు షాకిచ్చి "చెప్పరా వా...నా వాచీ ఎక్కడ దాచావో... నా లవర్ గిఫ్టుగా యిచ్చిన వాచీరా" అంటూ తీవ్రంగా హింసించాడు. చివరికా వాచీ ఎవరూ దొంగిలించలేదని, అతనే బాత్ రూంలో మరిచి పోయాడని బైట పడింది. కొంత కాలం పరారై అంతా సద్దు మణిగాక మళ్ళీ యూనివర్సిటీలో ప్రత్యక్షమయ్యాడు. మెస్సులోనూ అంతే. చిన్న తేడా వచ్చినా వర్కర్స్‌ని బూతులు తిట్టేవాడు. అటువంటి మదించిన ఏనుగు సాంబశివరావు.

అప్పుడే క్యాంపస్‌లో కొత్తగా అడుగుపెట్టిన మేరీతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకి నెమ్మదిగా ధగ్గరయ్యాడు. ఎక్కడలేని ప్రేమా వొలక బోయడం మొదలు పెట్టాడు.నువ్వు లేనిదే బతకలేన్నాడు. నీ పరిచయంతో నా జీవితమే మారిపోయిందన్నాడు. ఎస్సీ విద్యార్థుల్తో స్నేహం నటించాడు. కుల పిచ్చంటే అసహ్యం అందరూ సమానమన్నాడు. వల పన్ని శరీరాన్ని దక్కించుకున్నాడు. ఆమె గర్భవతి. ఇంతలో అతడి పెళ్ళి శుభలేఖ అందింది మేరీని వెక్కిరిస్తూ. ఆస్తికి వున్నత విద్య తోడవడంతో లక్షలాది కట్నమట.

మేరీ గుండె పగిలిపోయింది. ఆ రోజే వురి తీసుకుని చచ్చిపోయింది. యూనివర్సిటీలో ఉద్యమాలు... సాంబశివరావుపై విరుచుకు పడ్తూ నినాదాలూ... పత్రికల్లో ఉద్యమ వార్తలు.

ఆ వార్తలు సరిత కూడా చదివింది. "ఎవడు కడుపు చేశాడో? ఈ కులం తక్కువ వాళ్లకి నీతీ జాతీ వుండదు" అన్నాడు తన తండ్రి.

"నాన్నా, నీకుందా నీతి. నీ బతుకేంది? ఎందరమ్మాయిల బతుకు బుగ్గి చేశావ్. ఎన్ని వెధవ పనులు చేసి ఆస్తి పెంచుకొన్నావ్. ఈ సాంబశివరావుకుందా నీతి? నీతంటే జులుం, అధికారం, అత్యాచారం మాటల్తో, చూపుల్తో ప్రవర్తనతో అమాయకుల్ని లొంగదీసుకుని తూనీగకి తాడు కట్టినట్టు హింసించడమా?"

సాంబశివరావు బలంగా ఆక్రమించుకొంటున్నాడు. హింసించు, నలువు, నాశనం చెయ్. బుద్ధిలేని దాన్ని, సర్దుకుపోయే దాన్ని. డబ్బుకి శరీరాన్ని అప్పజెప్పి అన్ని రకాల హింసల్ని భరించే వేశ్య కన్నా హీనమైన దాన్ని. "మాంగల్యం తంతునా నేను" తన్న గలనా, పవిత్రమైన తాడు కట్టి లొంగదీసుకొని తెచ్చుకున్నావ్. మరో పశువుకి జన్మనిచ్చి పెంచి పెద్దచేసి ఆంబోతులా ఊరి మీద వదల వలసిన దానిని. జ్ఞానం, ధ్యేయం నిర్ణయం ఇవ్వలేని చదువు. యివ చదువు.


సాంబశివరావ్! నీ చదువు– జ్ఞానం అత్యాచారం, అవమానించడం, కుల పిచ్చి, జులుం వంటి వెయ్యి అవలక్షణాలకి ఒక గౌరవప్రదమైన ముసుగు.


నా చదువు లొంగుబాటుకి, వేశ్యా. వృత్తికి, కులం నుంచి సంక్రమించిన కుహనా గౌరవ ప్రతిష్టలకి నీచమైన భద్రజీవితానికి ముసుగు.

మేల్కొల్పులేని యూనివర్సిటీలూ, చదువులూ, రొచ్చుగుంటలు. అత్యాచారాల్ని ధర్మబద్ధం చేసే పెళ్ళిళ్లు.

నీ యిష్టం రేపిస్తూ... ఇలా రోజూ అత్యాచారం చేసి హింసించి కొంచెం కొంచెం చంపడం కన్నా ఒక్కసారిగా చంపెయ్.

చంపెయ్‌రా శాడిస్టూ. ఒక్క సారే చంపెయ్‌రా! మేరీలాగే ఉరి తీయ్. చిల్లర నేరాలకి తీవ్రంగా శిక్షించే కోర్టులూ, పోలీసులూ నీబోటోళ్ల వెంట్రుక పీకలేరు. నీకెలాగూ శిక్ష లేదు. నిన్ను పెళ్ళాడిన హీనమైన నేరానికి నాకు ఉరిశిక్షే సరైందిరా. ఎటువంటి క్షమాభిక్షలూ ఉండవ్. ఉరితీయ్...!






మీకు తెలుసా!:- సిమెంట్ సంచుల మీద మందంగా ఉన్న పాలిథిన్ పేపర్‌తో గానీ, టార్పాలిన్‌తో గానీ కప్పితే సిమెంట్ భద్రంగా ఉంటుంది.